విలేకరులు కావలెను

ప్రతిజ్ఞ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
వేణు
7032356032



# ప్రతిజ్ఞ

తెలుగు దిన పత్రిక

ప్రజాహితం - మా అభిమతం





PUBLISHED FROM : హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి | ఎడిటర్ : మోదుగు వేణు | శనివారం 30 మే 2026


### వరి ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై

## మంత్రి మీడియా సమావేశం

ప్రతిజ్ఞ న్యూస్ మే 29 హైదరాబాద్

ధాన్యం కొనుగోళ్ల అంశంపై ప్రతిపక్షాలు కావాలనే రాజకీయ విమర్శలు చేస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ ఏడాది తెలంగాణ ప్రభుత్వం వరి కొనుగోలు కోసం చేస్తున్నంత ఖర్చు భారతదేశ చరిత్రలో ఏనాడూ ఏ ప్రభుత్వమూ చేయలేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే అంగీకరించిందని గుర్తు చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా వరి కొనుగోళ్లు జరపడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని మంత్రి వెల్లడించారు.

**చివరి గింజ వరకు కొంటాం**

రైతులను ఆదుకుంటామంటూ బీజేపీ నాయకులు క్షేత్రస్థాయిలో నాటకీయ నిరసనలు చేస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల విధానం ప్రకారమే తాము ధాన్యాన్ని సేకరిస్తున్నామని, రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ యాసంగి సీజన్ పంటలో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండిందని, అందులో ద



75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఇందులో కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ముందే చెప్పిందని వెల్లడించారు. మిగిలిన అదనపు ధాన్యాన్ని రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వమే అప్పు చేసి మరి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు.

**తడిసిన ధాన్యం కూడా కొనుగోలు**

ఈ యాసంగి పంటలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు మంత్రి తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అక్కడ రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఇప్పటికే రూ.13,050 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

**రవాణా కోసం ప్రత్యేక చర్యలు**

ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇసుక లారీలను, అలాగే ఇతర ఫ్యాక్టరీల్లో నడిచే భారీ వాహనాలను కూడా ధాన్యం సేకరణకు ఉపయోగించాలని భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇందుకోసం వాహనాలను కేటాయించాలని ఆయా యాజమాన్యాలను కోరినట్లు తెలిపారు. అయితే, ప్రస్తుతం హమాలీల కొరత కొంత వేధిస్తోందని, బీహార్, బెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికులపైనే ఇందుకు ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోందని మంత్రి వివరించారు. ఈ ఇబ్బందులను కూడా అధిగమించి కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

### పవన్‌ను ప్యాకేజ్ స్టార్‌గా

## అభివర్ణించిన ఎమ్మెల్యే

ప్రతిజ్ఞ న్యూస్ మే 29 హైదరాబాద్



ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్‌ను ఒక 'ప్యాకేజ్ స్టార్' అని అభివర్ణిస్తూ, భవిష్యత్తులో వైఎస్ జగన్ ఎక్కువ ప్యాకేజీ ఇస్తే ఆయనకు మద్దతు ఇవ్వడానికి కూడా వెనుకాడరని ఎద్దేవా చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపుతున్నాయి. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌ను విమర్శించే స్థాయి, అర్హత పవన్ కల్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి అన్నారు. "దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయండి. ఆయన ఇంటి ముందు నేను అడ్డుగా నిలబడతా" అంటూ పవన్‌కు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ బిడ్డల జోలికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరైనా రావాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అవసరమైతే మళ్లీ 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మొదలవుతుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏపీ రాజకీయ నేతల తీరుపై ఆయన మండిపడ్డారు. "మీరంతా ఉండేది హైదరాబాద్‌లో, ఆస్తులు సంపాదించుకునేది ఇక్కడే. మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?" అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం సరికాదని, తెలంగాణ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.

## ముగిసిన బండి భగీరథ్ పోలీసు కస్టడీ.. జైలుకు తరలింపు

-మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్టు భగీరథ్ పై ఆరోపణలు
-భగీరథ్ పై పోక్సో కేసు పెట్టిన పోలీసులు
-మూడు రోజుల పాటు భగీరథ్ ను ప్రశ్నించిన పోలీసులు

ప్రతిజ్ఞ న్యూస్ మే 29 హైదరాబాద్



మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారు బండి భగీరథ్ పోలీసు కస్టడీ ముగిసింది. భగీరథ్ ను పోలీసులు మూడు రోజుల పాటు విచారించారు. విచారణ ముగియడంతో భగీరథ్ ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ కేసు ప్రత్యేక విచారణాధికారి, కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో పోలీసులు భగీరథ్ ను విచారించారు. సీన్ రీకన్స్ట్రక్షన్ చేసేందుకు మొయినాబాద్ ఫామ్ హౌస్ కు కూడా ఆయనను తీసుకెళ్లారు. డిసెంబర్ 31న బాధితురాలిని భగీరథ్ తన స్నేహితులతో కలిసి ఫామ్ హౌస్ కి తీసుకెళ్లి అఘాయిత్యం చేసినట్టు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అయితే పోలీసు విచారణలో పలు ప్రశ్నలకు భగీరథ్ సమాధానాలు చెప్పకుండా మౌనంగా ఉన్నట్టు సమాచారం.

## ఎస్ఐఆర్ సమయంలో అనుసరించాల్సిన తీరుపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్

-ప్రతి ఓటును కాపాడుకోవాలి: మహేశ్ కుమార్ గౌడ్
-హాజరైన మీనాక్షి నటరాజన్ తదితర నేతలు
-బెంగాల్ లో 93 లక్షల ఓట్లను తొలగించారన్న ద మహేశ్ గౌడ్

ప్రతిజ్ఞ న్యూస్ మే 29 హైదరాబాద్

దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మిగిలిపోయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియను ఈసీ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియ సమయంలో అనుసరించాల్సిన తీరుపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తమ నేతలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గాంధీ భవన్ ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ మాస్టర్ ట్రైనీలకు ఏఐసీసీ శిక్షణ విభాగానికి సంబంధించిన సౌరభ్, అనూష, నిశాంత్ శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనీలు రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో బీఎల్ఏలకు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ ప్రక్రియను పకడ్బందీగా చేశామని వెల్లడించారు. జిల్లా కమిటీలు, మండల కమిటీలు దాదాపు పూర్తి చేశామని చెప్పారు. పశ్చిమబెంగాల్ లో 93 లక్షల ఓట్లను తొలగించారని.. బీజేపీ చేసిన కుట్రలతో అక్కడ ప్రభుత్వమే మారిపోయిందని మండిపడ్డారు.



తెలంగాణలో అలాంటి కుట్రలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు.

## 'హైడ్రా ఈగిల్ టీమ్' పేరుతో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ

-హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు... 'ఈగిల్ టీమ్' పేరిట విధులు
-తెలంగాణలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వ ఉద్యోగాలు
-హైడ్రా సంస్థలో... కబ్జాల తొలగింపు విధుల్లో నియామకం
-ఈ ఉద్యోగం తమకు గౌరవం, ఆత్మవిశ్వాసం ఇచ్చిందని వెల్లడి
-వారి పనితీరుపై అధికారుల ప్రశంసలు

ప్రతిజ్ఞ న్యూస్ మే 29 హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఓ వినూత్న నిర్ణయం, సమాజంలో మార్పునకు నాంది పలుకుతోంది. హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు కల్పించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. ఈ చొరవ ద్వారా వారికి గౌరవప్రదమైన జీవనోపాధిని అందించి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగస్వాములను చేసింది. ఈ బృందంలో 11 మంది ట్రాన్స్ మహిళలు, ఐదుగురు ట్రాన్స్ పురుషులు ఉన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులు, ప్రభుత్వ భూములపై అక్రమ కట్టడాలను తొలగించడంలో వీరు చురుగ్గా పాల్గొంటున్నారు. కబ్జాదారులు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా భయపడకుండా, నిర్భయంగా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. వీరిని 'హైడ్రా ఈగిల్ టీమ్'గా పిలుస్తున్నారు. ఈ ఉద్యోగం తమకు కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, జీవితానికి కొత్త గుర్తింపును, ఆత్మగౌరవాన్ని ఇచ్చిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా యూనిఫాం ధరించి విధులకు హాజరవడం తమకు ఎంతో గర్వకారణమని చెబుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్‌లో 862 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని, మాదాపూర్‌లోని ఎదులకుంట చెరువును కబ్జాదారుల బారి నుంచి కాపాడటంలో ఈ బృందం కీలక పాత్ర పోషించింది. కబ్జాల తొలగింపు సమయంలో ప్రజలకు నచ్చజెప్పడం, మహిళలతో మాట్లాడి ఉద్రిక్తతలు తగ్గించడం, అధికారులు-ప్రజల మధ్య సమన్వయం చేయడంలో వీరు అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని హైడ్రా అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని ప్రశంసించారు. "గతంలో



బతుకుదెరువు కోసం అడుక్కునేవాళ్లం. ఎక్కడికి వెళ్లినా హేళన చేసేవారు. పని అడిగితే ముఖం మీదే లేదనేవారు. కానీ, ఇప్పుడు యూనిఫాంలో విధులకు వెళుతుంటే అందరూ మర్యాదగా మాట్లాడుతున్నారు" అని తాన్ని రాయ్ ఆనందంగా చెప్పారు. "అవకాశం ఇస్తే ట్రాన్స్‌జెండర్లు ఏ రంగంలోనైనా రాణించగలరు. హైడ్రాలో మా విధులే దీనికి నిదర్శనం. ఇక్కడ అధికారులు, ఇతర సిబ్బంది మమ్మల్ని సమానంగా చూస్తారు" అని గాయత్రి తెలిపారు. ఈ ఉద్యోగం వల్ల వీరు ఇప్పుడు ఆర్థికంగా స్థిరపడి, తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా 'మేము కూడా సమాజానికి సేవ చేయగలం' అనే ఆత్మవిశ్వాసం వారిలో వెల్లివిరుస్తోంది.

### ఉద్యోగులకు ఇచ్చిన మాట

## నిలబెట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

ప్రతిజ్ఞ న్యూస్ మే 29 హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కారు శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిల తొలి విడత మొత్తాన్ని ఇవాళ విడుదల చేశారు. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ.6,000 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈరోజు తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని క్లియర్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను కూడా పూర్తిగా చెల్లించారు. ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి తమ ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోందని వెల్లడించింది. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపుతున్నదనడానికి ఇది నిదర్శనమని, ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 2 వ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి కి నివాళులర్పించిన వారు

**-దేశినేనిపాళేం గ్రామ అధ్యక్షుడు**

**-ఆవుల కిరణ్ కుమార్**

ప్రతిజ్ఞ పత్రిక మే 29 మధిర రిపోర్టర్



మధిర : రెండవ డివిజన్ అధ్యక్షుడు మరియు టౌన్ ఐఎన్టీయూ అధ్యక్షుడు మా మిత్రుడు షేక్ బాజీ మా మధ్య లేరని తెలుపుటకు చింతిస్తున్న వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మామిత్రుడు ఈ లోకాన ఉన్న తన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నాను దేశినేనిపాళేం గ్రామ అధ్యక్షుడు ఆవుల కిరణ్ కుమార్.

మన తెలంగాణ ముద్దుబిడ్డ జిల్లా నాయకులు

## తాడోజు వెంకటాచారి నాగమణి దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు



ప్రతిజ్ఞ మే 29 ఖమ్మం

వెంకటాచారి నాగమణి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ మహిళా అధ్యక్షురాలు గన్నోజు గోవిందమ్మ 59వ డివిజన్ అధ్యక్షుడు బ్రహ్మశ్రీ తాటికొండ వెంకటాచారి, కోశాధికారి జుజ్జురి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి ముమ్మడి రాజయ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓలోజు రామాచారి కార్యదర్శి బాజోజు కొటాచారి చీఫ్ సెక్రటరీ చిట్టోజు రామ్ బ్రహ్మం సభాపతి కన్నెగంటి అమరేందర్ చారి, కమిటీ సభ్యులు కత్రోజు రామకృష్ణ గారు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గన్నోజు గోవిందమ్మ శాలువాలతో సత్కరించగా, అనంతరం 59వ డివిజన్ అధ్యక్షుడు తాటికొండ వెంకటాచారి మరియు కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. తాడోజు వెంకటాచారి నాగమణి దంపతులు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మరియు గోవిందమాంబ ఆశీస్సులు ఎల్లప్పుడూ వారికి ఉండాలని కోరుతూ హృదయపూర్వక పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్లు 59వ డివిజన్ విశ్వబ్రాహ్మణ సంఘం దానవాయిగూడెం.

## యశోద హాస్పిటల్ హైదరాబాద్ సోమాజిగూడ లో గ్యాస్టిక్ క్యాన్సర్ కు అరుదైన శాస్త్ర చికిత్స

ప్రతిజ్ఞ మే 29 ఖమ్మం




ఖమ్మం : యశోద మెడికల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ డాక్టర్ లాపరోస్కోపిక్ మరియు రోబోటిక్ సర్జన్ వై శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఇటీవలే ఖమ్మం ప్రాంతానికి చెందిన ఒక పేషెంట్ పితాశయం క్యాన్సర్ తో యశోద హాస్పిటల్ ను సంప్రదిస్తే ఆమెకు లివర్ ఫంక్షన్ టెస్ట్ లు చేసి అడ్వాన్స్ లాపరోస్కోపిక్ , రోబోటిక్ సర్జరీ తో అరుదైన శాస్త్ర చికిత్స అందించామని పేర్కొన్నారు . గాలి బ్లాడర్ లో ఎక్కువ రోజులు స్టోన్స్ పెట్టుకున్న ఈ సమస్య వస్తుందని అన్నారు . ఈరోజుల్లో గ్యాస్టిక్ క్యాన్సర్లు చాలా ఎక్కువగా ఉన్నాయని , సమయానికి ఆహారం తీసుకోకపోవడం వల్ల , జంక్ ఫుడ్ , సిగరెట్స్ మద్యపానం మరి కొంతమందికి వారస్వతంగా ఆడవాళ్లకు మగవాళ్లకు అందరికీ వస్తుందని తెలిపారు . వారసత్వంగా వచ్చే క్యాన్సర్లు ఈ జనరేషన్ వాళ్ళు కూడా వచ్చే అవకాశలు ఎక్కువ ఉన్నాయి . తక్కువ వయసు వాళ్లకు కూడా వస్తాయి . కొంతమంది ఫాస్టింగ్ చేసి వెయిట్ లాస్ అయ్యే వాళ్లకు మరియు ఫ్యామిలీ హిస్టరీ ఉండేవాళ్లు ఎక్కువ అవకాశలు ఉన్నాయన్నారు . వాళ్ల పేరెంట్స్ కి ఎప్పుడైతే క్యాన్సర్ వచ్చిందో టెన్ ఇయర్స్ ముందే రెగ్యులర్ గా ఫాలోఅప్ చేసుకోవాలి . 5 ఇయర్స్ కి ఒకసారి ఎండోస్కోప్ , రెగ్గర్ అల్ట్రా సౌండ్ టెస్టులు చేయించుకుని ఫాలో అప్ చేసుకుంటే సింపుల్గా కంట్రోల్ చేసుకోవచ్చు . రెగ్యులర్ గా కడుపునొప్పి , బరువు తగ్గటం , ఆకలి లేకపోవడం , వాంతులు అవ్వడం లక్షణాలు ఉంటే అడ్వాన్స్ స్టేజ్ లో ఉన్నట్టు . వెంటనే సంబంధించిన డాక్టర్ ను సంప్రదించాలని అన్నారు . పేగు సర్జరీ చేస్తే మూడు నాలుగు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారు . మోస్ట్ డేంజర్ గాలి బ్లాడర్ క్యాన్సర్ . అవుట్ సైడ్ ఫుడ్ మ్యాగ్జిమం అవాయిడ్ చేయాలి . నిద్ర మంచిగుండాలి , ఎక్కువ స్టెయిన్ పడొద్దు మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండాలి . మన యశోద హాస్పిటల్ హైదరాబాద్ సోమాజిగూడ లో అడ్వాన్స్ కీమోథెరపీ , రేడియోథెరపీ మరియు అన్ని విధాల క్యాన్సర్లకు అతి తక్కువ ఖర్చుతో వైద్య సదుపాయం అందుబాటులో ఉంది అని అన్నారు . ఈ కార్యక్రమంలో వీతీ. శ్రీధర్ రావు , నాగార్జున , బాల కృష్ణ పాల్గొన్నారు .

# 12 రోజులుగా కొనసాగుతున్న వివో ఏ నిరాహార దీక్ష ని సందర్శించిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు

ప్రతిజ్ఞ దినపత్రిక ఇల్లందు మండలం



ఇల్లందు మండలంలో పనిచేస్తున్న ఐకెపి మరియు సెల్ఫ్ అనుబంధ వి ఓ ఏ ఎస్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ పరిష్కారం కోసం గత 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తూ నిరహాదీక్ష కొనసాగిస్తున్న దీక్ష శిబిరాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు సందర్శించి మద్దతు తెలిపి. మద్దతు సంఘీభావం ప్రకటించి వారి న్యాయమైన డిమాండ్స్ ను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగినది ఈ సందర్భంగా టిఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు ఉద్యమ నాయకులు దిండిగల రాజేందర్ వారి ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు తమ ఎన్నికల ప్రణాళికలో పొందుపరిచిన మేరకు వివోఏ వేతనాలు పెంచాలని జీవో నెంబర్ 58 నీ సవరించాలని అర్హులైన వివోఏ లను కమ్యూనిటీ వార్డినేటర్లుగా నియమించాలని డిమాండ్ చేయడం జరిగినది రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకమందు రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో వివిధ వర్గాల ప్రజలకు ఆచరణ సాధ్యం కానీ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల గడిచిన ఇచ్చిన హామీలను అమలు చేయలేక అన్ని వర్గ ప్రజలను వంచన చేసి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మీ సమస్యలు పరిష్కారం కోసం తుది వరకు పోరాటం చేయాలని టిఆర్ఎస్ పార్టీ మీ సమస్య పరిష్కారం కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు అబ్దుల్ నవి నారపాక వసంతరావు పి రవి గౌడ్ రాచపల్లి శీను సాన రాజేష్ ఉపేందర్ రావు వంగ సునీల్ కుమార్ మునుగంటి శివ గడ్డి శ్రీనివాస్ ఎండి అమీర్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు

## జూన్ 1 నుండి 5 వరకు కోటప్పకొండ లో జరుగుతున్న ఏఐవైఎఫ్ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి:- ఏఐవైయఫ్

కడపబ్యూరో ప్రతిజ్ఞ న్యూస్ రిపోర్టర్




పల్నాడు జిల్లా కోటప్పకొండ లో జూన్ 1 నుండి 5 వరకు జరుగుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక సాంస్కృతిక, రాజకీయ శిక్షణ తరగతులను యువత పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెద్దులపల్లి ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం బద్వేలు పట్టణం సిపిఐ కార్యాలయం జెవి భవన్ నందు ఏఐవైఎఫ్ శిక్షణా తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతి సంవత్సరం నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగం ఇవ్వలేకపోతే నెలకు రూ. 3,000 నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువగలం పాదయాత్రలో నారా లోకేష్ బాబు షూరిటీ జాబ్ గ్యారంటీ చెప్పి మీకిచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోతే నా చొక్కా పట్టుకొని అడగమనేసి అప్పట్లో యువకులకు ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతుండగా, ఉపాధి లేక యువత ఆత్మహత్యలకు, డ్రగ్స్, గంజాయి, మద్యం వ్యాసనాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తు చీకటిలోకి నెట్టబడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఒకవైపు ఉద్యోగాల కల్పనలో విఫలమై, మరోవైపు చంద్ర బాబు నాయుడు "ముగ్గురు పిల్లలు కనండి రూ. 30 వేలు, నలుగురు పిల్లలు కనండి రూ. 40 వేలు" అంటూ ప్రకటనలు చేయడం హాస్యాస్ప దమన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం తాండవం చేస్తుంటే దానిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రజల సమస్యలను పక్కనబెట్టి ప్రజలను మభ్యపెడుతుందని విమర్శించారు. యువతకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కోటప్పకొండలో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో జూన్ 1 నుండి 5 తేదీలలో నిర్వహించ బడుతున్న విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక శిక్షణ తరగతుల గురించి వివరించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కోవాలంటే రాజకీయ అవగాహన ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో రాజకీయ అవగాహన, పర్యావరణ రక్షణ, యువజన నాయకత్వ వికాసం, పోరాటాల చరిత్ర, సమకాలీన రాజకీయ విశ్లేషణ వంటి అంశాలపై ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్లు బోధన అందిస్తున్నారని తెలిపారు. అలాగే సినీ ప్రముఖులు, మేధావులు, లౌకికవాదులు హాజరై యువతకు సందేశం ఇస్తున్నారని చెప్పారు. రాష్ట్ర నలుమూలల నుండి యువత పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు వరికుంట్ల శ్రీను, మునిరత్నం, సురేంద్ర గోపాల్ పాల్గొన్నారు..

# ఘనంగా టి పిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం






ఖమ్మం బ్యూరో మే 29(ప్రతిజ్ఞ పత్రిక)

ఖమ్మం నగరం: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు టి పి టి ఎఫ్ జిల్లా కార్యాలయంలో మల్లయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శులు ఎస్ విజయ్, వై. పద్మ ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు పి నాగిరెడ్డి జిల్లా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి మనోహర్ రాజు పాల్గొన్నారు. వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి. మనోహర్ రాజుగారు పతాకావిష్కరణ చేసినారు. అనంతరం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ 1944 సంవత్సరము నుండి ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు పుట్టిందని అదే ఉద్యమ స్ఫూర్తితో నేడు ఉపాధ్యాయ విద్యానంగ సమస్యల పరిష్కారంలో ముందు న్నదని తెలిపినారు. ప్రస్తుత ప్రభుత్వము విద్యారంగం పట్ల కనీసం 15% నిధులను కూడా కేటాయించకుండా విద్యలు గుణాత్మకమైన మార్పు అసాధ్యమని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ విజయ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్ డిజిటలైజేషన్ ప్రక్రియ ఈనెల 31 తో ముగుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ హెచ్ ఎస్ కార్డు ల పట్ల సరియై నటువంటి నిర్దిష్ట మైనటువంటి నిబంధనలు లేకుండా ఉపాధ్యాయులను గందరగోళంలో నెట్టివేసిందని విమర్శించారు. ప్రస్తుతం ఉపాధ్యాయు లందరూ సెన్సెస్ డ్యూటీలో ఉన్నందున సర్వీసు రిజిస్టర్ డిజిటలైజేషన్ ప్రక్రియ జూన్ 30 వరకు పొడిగించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్యదర్శి వై. పద్మా మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగులకు వెంటనే పి ఆర్ సి ని అమలు చేయాలని పెండింగ్ లో ఉన్నటువంటి డి ఎ లను వెంటనే విడుదల చేయాలని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉన్నటువంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్స్ స్కేలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కి విజ్ఞప్తి చేశారు. సంఘం అంటే బ్యానర్ కాదని ఒక బాధ్యత అని ఇలాంటి సంఘంలో ప్రతీ కార్యకర్త నిబద్దతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని సమాజంలో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు పి. నాగిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కే. వెంకటేశ్వర్లు, బి ముత్తయ్య శ్యాంసుందర్, జిల్లా కమిటీ బాధ్యులు నాగేశ్వరరావు భావసన్ సంధ్యారాణి ఉమాదేవి హనుమంతరావు జి వెంకటేశ్వర్లు వివిధ మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీనీ అరికట్టాలి

-అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి.
-డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని

కడపబ్యూరో ప్రతిజ్ఞ న్యూస్ రిపోర్టర్

బద్వేల్ పట్టణంలోని అలాగే పోరుమామిళ్ల పట్టణంలో ఉన్నటువంటి ప్రైవేట్ ఆసుపత్రిల లో జరుగుతున్న దోపిడీని అరికట్టడంలో జిల్లా వైద్యశాఖ అధికారులు విఫలమయ్యారని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని ఆవేదన వ్యక్తం చేశారు శుక్రవారం బద్వేల్ పట్టణంలోని డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్ కే ఆదిల్ లతో కలిసి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ... బద్వేల్ మరియు పోరుమామిళ్ల పట్టణంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు అధిక ఓపి ఫీజులు వసూలు చేస్తున్నాయని అలాగే రకరకాల పరీక్షల పేరుతో టెస్టులు నిర్వహించి బయట ఓపి పేషెంట్ కు డాక్టర్ చూస్తే ఒక ఫీజు ఐసీయూలో ఒకరోజు అయినా డాక్టర్ ఫీజు 2000 రూపాయలు చెకప్ కు వసూలు చేస్తున్నారు అన్నారు అదేవిధంగా కనీసం పేషెంట్ హాస్పిటల్ బిల్లు హాస్పిటల్ పేరుతో కాకుండా తెల్ల పేపర్ మీద రాసిస్తున్నారని వారన్నారు ఒకరోజు హాస్పిటల్ లో ఉంటే దాదాపు 30 వేల రూపాయలు వరకు చాట్ చేస్తున్నారని అన్నారు అంతేకాకుండా హాస్పిటల్లో ఫార్మసిస్టులు కూడా ఉండరని అనుభవం లేని వారితో మందులు ఇప్పిస్తున్నారని అలాగే హాస్పిటల్ లో చాలామంది క్వాలిఫికేషన్ చదివిన వారితో కాకుండా తక్కువ జీతం ఇస్తూ క్వాలిఫికేషన్ లేని వారిని నియమించు కుంటున్నారని వారు అన్నారు హాస్పిటల్ లో ఎక్కడ గానిపార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వచ్చినటువంటి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు డాక్టర్ లేని సమయంలో అక్కడ పని చేస్తున్నటువంటి సిబ్బంది వైద్యం చేస్తున్నారని వారు తెలిపారు పేద ప్రజలు వైద్యం కోసం ఆరోగ్యాలు బాగు చేసుకోవాలని వస్తే వారు వేసే వేలకు వేలు డబ్బులతో బెంబేలుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈ ఆస్పత్రుల పైన గతంలో జిల్లా వైద్య శాఖ అధికారులకు తెలియజేసినప్పటికీ వారి పైన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు అర్థం కావడం లేదని వారు అన్నారు వైద్య శాఖ అధికారులు తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యం వహించడం వల్లే ప్రైవేట్ ఆస్పత్రులు ఇష్టాసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు బద్వేల్ పోరుమామిళ్లపట్టణంలో పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రిలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని అన్నారు



సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు అలాగే ఈ రెండు ప్రాంతాలలో ఫార్మసిస్టులో లేకపోవడంతో పదో తరగతి ఇంటర్మీడియట్ చదువుకున్నటువంటి వారిని తక్కువ జీతం ఇచ్చి హాస్పిటల్లో పని చేయించుకుంటున్నారని వారు అన్నారు డాక్టర్లు ఆసుపత్రిలో మెడికల్ షాపులు పెట్టి ఇటువంటి పర్మిషన్ లేకుండా ఫార్మసిస్టులు లేకుండా హాస్పిటల్ బిల్లులు ఇవ్వకుండా వైట్ పేపర్ మీద బిల్లులుస్తూ వేలకు వేల రూపాయలు కాజేస్తున్న జిల్లా వైద్య శాఖ అధికారులకు కనిపించడం లేదని వారు అన్నారు ఇంత జరుగుతున్నా వారిపైన చర్యలు తీసుకోకపోవడం వెనక ఉన్న ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు ఇలాగే కొనసాగితే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

# ఘనంగా మేరా యువ భారత్ వీర్ వీర్ సావర్కర్ జయంతి





ఖమ్మం బ్యూరో మే 29 (ప్రతిజ్ఞ పత్రిక)

ఖమ్మం నగరం: ఖమ్మం జిల్లా మేరా యువ భారత్, ప్రజ్వల యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా యువజన అధికారి రాంబాబు ఆదేశాల మేరకు అకౌంట్స్ ఆఫీసర్ కే. భాను చందర్ సహకారంతో వినాయక దామోదర్ సవర్కర్ జయంతిని పురస్క రించుకొని జిల్లా లైబ్రరీలో యువతీ యువకులు ముందుగా ఆయనకి పూలమాలలతో నివాళులర్పించి వక్తృత్వ మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించి సవర్కర్ గురించి వారి సామాజిక సేవ, దేశానికి చేసినటువంటి సేవలను గుర్తించి వారి గురించి మరింత యూత్ వెళ్లాలని ఆలోచనతోటి వారి పైన పోటీలు నిర్వహించి గెలుపొందిన యువతీ యువకులకు వ్యాసరచన లో గెలుపొందిన ఎం. సుధా, ఎన్. ఉపేందర్, ఎం. శివాజీ వక్తృత పోటీల్లో గెలుపొందిన పి. అఖిల్, వై. భారతి, ఎం. మురళి గెలు పొందిన విజేతలకు శీల్డ్, సర్టిఫికెట్లు అందించడం అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షులు చింతమాల పాపయ్య, వాలంటీర్స్ మురళి గోపి వివేక్ యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు

# ది.29-5-2026 న ఘనంగా టి పి టి ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

-టి పి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు.

ప్రతిజ్ఞ మే 29 ఖమ్మం

ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు ఒక సంఘం ఉండాలని భావించి మొట్టమొదటిసారిగా 1944 వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఆప్టాఫ్) గా నిరంతరం ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు పోరాటం చేస్తూ "అన్ని సంఘాలకు మాతృ సంఘంగా" వెలిసిన సంఘం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు అయిన తర్వాత తెలంగాణలో ది. 29-5-2014 న "తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ "గా ఆయుర్భవించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కూడా అత్యంత క్రియాశీలకంగా అన్ని సంఘాలను ఏకతాటిపై తీసుకొచ్చి ప్రధాన నాయకత్వాన్ని తీసుకొని బాధ్యతగా అనేక ఉద్యమాలు చేపట్టి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో క్రియాశీలకంగా పని చేసింది. సామాజిక మార్పే దేశ భవిష్యత్తుకు పునాది అని తెలుసుకొని, సామాజిక మార్పు అనేది సమాజంలోని ఉన్న ప్రభుత్వ పాఠశాలల వల్లనే మారుతుందని భావించి "బాధ్యతలకై నిలబడు, హక్కులకై కలబడు" అనేటటు వంటి నినాదంతో ఇప్పటివరకు నిరంతరము సామాజిక , విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు ముక్కుసూటిగా ప్రశ్నించి సమస్యల పరిష్కారంలో ముందున్నది. ఇంత గొప్ప చరిత్ర కలిగిన ఉపాధ్యాయ సంఘం. ది 29-5-2026 న ఖమ్మం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల తో పాటు ఖమ్మం జిల్లా టి పి టి ఎఫ్ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని నిర్ణయిం చడమైనది. జెండా ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం కార్యకర్తల సమావేశము ఉంటుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శులుఅ ఎస్ విజయ్ వై పద్మ ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు పి



నాగిరెడ్డి జిల్లా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి మనోహర్ రాజు పూర్వ రాష్ట్ర అకాడమిక్ సెల్ కన్వీనర్ ఆళ్ల రామారావు హాజరవుతారు. కావునఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని టి పిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. వెంగళరావు పిలుపునిచ్చారు.

# క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు

ప్రతిజ్ఞ పత్రిక మే 29 ఖమ్మం

పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార ఌ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైనజీవనం కల్పించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు.. భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.హాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకుకూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా



రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# రఘునాధపాలెంలో వీఓఏల వినూత్న నిరసన 12వ రోజుకు చేరిన దీక్షలు

ఖమ్మం బ్యూరో మే 29 (ప్రతిజ్ఞ పత్రిక)



రఘునాథపాలెం మండలం: న్యాయమైన కోరికల సాధన కోసం గత 12 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఐకెపి వీఓఏలు రఘునాధపాలెం కేంద్రంలోని వినూత్న నిరసన తెలిపారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట వివోఏలు చేపట్టిన నిరసన దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. కనీస వేతనం రూ.20వేలు అమలు చేయాలని, 58 జీవో ను సవరించాలి ఉద్యోగ భద్రత హెచ్ఐర్ పాలసీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ శు క్రవారం ఒంటికాలిపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. ఇంత ఎండలో ఉంటూ మా గోడును ఇకనైనా ప్రభుత్వం గుర్తించి పట్టించుకోవాలని. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు ప్రభుత్వాన్ని ఈ మేరకు కోరారు. ఈ కార్యక్రమంలో స్వాతి, భాస్కర్, యుగంధర్, రామారావు, సంపూర్ణ, రేణుక ఈశ్వరి, శృతి, లలిత, ఉమ రాణి, లక్ష్మీ, జ్యోతి, అనురాధ వసంత, వరలక్ష్మి, శివ, ప్రియాంక, సునీత, కాజాబీ,సలేహా, సుజాత, తదితరులు ఈ దీక్షలో పాల్గొన్నారు.

# లకావత్ సైదులు నాయక్ ను పరావిమర్శించిన తుమ్మల తనయుడు యుగంధర్



ఖమ్మం బ్యూరో మే 29 (ప్రతిజ్ఞ పత్రిక)

ఖమ్మం నగరం: ఎనిమిదవ డివిజన్ మాజీ కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్ ను పరామర్శించిన మంత్రి తుమ్మల తనయుడు కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కబ్జా కోరల నుంచి రక్షించే క్రమంలో ఎడమ కాలు విరిగి గాయం అయిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మల యుగంధర్ సైదులు నాయక్ ను పరమర్శించారు. గాయం అయిన కాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కబ్జా కోరుల నుంచి ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడే విషయంలో జరిగిన సంఘటన గురించి పూర్తిస్థాయిలో సైదులు నాయక్ యుగంధర్ కి వివరించారు. ప్రభుత్వ స్థలము ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిందితులను చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా చేపడతామని అన్నారు. అక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడుతున్న సైదులు మీద దౌర్జన్యం చేసి కాలుకు గాయం చేయటం దారుణ మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుగంధర్ తో పాటు ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, స్థానిక డివిజన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రెండోవ విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం కోసం వస్తున్న సందర్భంగా సభ ఏర్పాట్ల పనులను పరిశీలన



ప్రతిజ్ఞ మే 29 :

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన రెండోవ విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చేస్తున్న సందర్భంగా సిర్పూర్ కాగజ్ నగర్ లోని ఎక్స్ రోడ్డు వద్ద జరగబోయే సభ ఏర్పాట్ల పనులను పరిశీలించిన ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కే హరిత,మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్,నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆసిఫాబాద్ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు విశ్వ ప్రసాద్ రావు.అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ...జూన్ 1వ తేదీన జరగబోయే సీఎం రేవంత్ రెడ్డి గారి సభకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలని అధికారులందరికీ పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు,ప్రజాప్రతి నిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలి - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి

ప్రతిజ్ఞ మే 29



ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్--2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఇంచార్జ్ ఆర్డిఓ ప్రతాప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ, స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదిగా ఉంటాయని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బి ఎల్ ఓ లు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపడుతుండగా, ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ఏ ఈ ఆర్ ఓ లు, బి ఎల్ ఓ లు, సూపర్వైజర్లు, ఎలక్షన్ తహసిల్దార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎమ్మెల్యే రాక

ప్రతిజ్ఞ మే 29

మండల కేంద్రంలోని డాంగపల్లి మార్కెట్ కమిటీ గోదాంలో ఉదయం 9 గంటలకు జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రామారావు పాటిల్ ప్రారంభిస్తారని, అలాగే 9.30నిమిషాలకు తానూర్ రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్, చెక్కుల పంపిణీ ఉంటుందని బిజెపి మండల అధ్యక్షుడు పూండ్ర లక్ష్మణ్ రెడ్డి ప్రకటనలో తెలిపారు.

## తానూర్ మండల సమైక్య కార్యాలయంలో స్నేహ ప్రోగ్రాం నిర్వహణ

ప్రతిజ్ఞ మే 29



తానూర్ మండల సమైక్య కార్యాలయంలో కిశోర బాలికల స్నేహ సంఘాల సభ్యులతో స్నేహ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా, బాలికల రక్షణ చట్టాలు, ఆరోగ్య పోషణ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో శ్రీధర్ మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డాక్టర్ మహేష్ మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం, పోషకాహారం, రక్తహీనత నివారణపై పలు సూచనలు చేశారు. పోలీస్ శాఖ ప్రతినిధులు బాలికల భద్రతకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఏపీఎం, సులోచన ,అధ్యక్షురాలు, కార్యదర్శి, సీసీలు, అకౌంటెంట్, ఆపరేటర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సంపద దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలి : సీపీఎం డిమాండ్

ప్రతిజ్ఞ మే 29





ప్రకృతి సంపదను అక్రమంగా దోచుకుంటున్న మాఫియాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మండల సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. చెరువుల మట్టి, కాలువల మొరం, ఇసుక అక్రమ రవాణా, చెట్ల విధ్వంసం వంటి ప్రకృతి వనరుల దోపిడీని అరికట్టకపోతే భవిష్యత్తులో తీవ్ర ప్రకృతి విపత్తులకు మనమే కారణమవుతామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటుక బట్టీల యాజమాన్యాలపై చర్యలు తీసుకుని అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని కోరారు. ఇటుక ధరలు అదుపు లేకుండా పెరిగిపోవడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. పేదలకు అందుబాటులో ఉండేలా ఇటుక ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు అవసరమైన ఇసుక, మట్టి, మొరం వంటి వనరులపై ప్రభుత్వం అనేక నిబంధనలు విధిస్తోందని, మరోవైపు ప్రకృతి సంపదను దోచుకునే మాఫియాలకు పాలకులు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇసుక, ఇటుక, స్టీల్, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి ధరలను ప్రభుత్వం నియంత్రించాలని, పేదలు ఇళ్లు నిర్మించుకునేలా ధరలను స్థిరీకరించాలని కోరారు. ప్రకృతి సంపదను కాపాడుతూ పేద, మధ్యతరగతి వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.

# జింకలగూడెంలో ఘనంగా ముగిసిన జేపీఎల్-2 క్రికెట్ పోటీలు







ప్రతిజ్ఞ మే 29 ఖమ్మం

తిరుమలాయపాలెం మండలం జింకలగూడెంలో యంగ్ స్టార్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జేపియల్ -2 జింకలగూడెం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల తుదిపోరు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. గ్రామ యువత క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి శిబిర కార్యాలయ ఇంచార్జి తుంబురు దయాకర్ రెడ్డి హాజరై విజేత జట్టుకు ట్రోఫీ అందజేసి క్రీడాకారులను అభినందించారు. రెండో స్థానం పొందిన జట్టుకు గ్రేటర్ ఇన్ఫ్రా చైర్మన్ సయ్యద్ ఇమాం బహుమతి అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల అశోక్, బెల్లం శ్రీనివాస్, రామసహాయం నరేష్ రెడ్డి, మంగిలాల్, శ్రీనివాస్ రెడ్డి, గోల్ తండా గ్రామపంచాయతీ సర్పంచ్ బాణోత్ సుజాత అనిల్ కుమార్, గ్రామస్తులు షేక్ కరీం, సయ్యద్ మదర్, సయ్యద్ సీలర్, షేక్ జబ్బార్, క్రీడా కమిటీ సభ్యులు షేక్ లాల్, మొహమ్మద్ సైదా, మొహమ్మద్ వలి, షేక్ నజీర్, మొహమ్మద్ కరీం అలీతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని అతిథులు పేర్కొన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన యువజన సంఘ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

# తీవ్ర ఎండ ప్రభావంతో అస్వస్థకు గురైన మరో వివోఏ





**-తీవ్ర జ్వరం సొమ్మసిల్లి పడిపోయిన వివోఏ ని చూసి తోటి వివోఏల లో ఆవేదన...**

**-తమ కనీస వేతన అమలకై చేస్తున్న దీక్షలో రోజుకు ఒక వివోఏ అనారోగ్యానికి గురి**

**-వెంటనే ప్రభుత్వం స్పందించి తమ న్యాయమై న డిమాండ్ లను పరిష్కరించాలని ఆవేదన**

ప్రతిజ్ఞ మే 29 ఖమ్మం

వివోఏలకు కనీస వేతనం అమలు చేయాలని గత ఎనిమిది రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో నిరాహార దీక్ష 8వ రోజుకు చేరింది త్రీవర ఎండల ప్రభావంతో దీక్ష శిబిరంలో రోజుకో వివోఏ అనారోగ్యానికి గురవుతున్నారు. గత ఆదివారం వివో ఏ అరుణ స్పృహ తప్పి పడిపోగా శుక్రవారం గుగ్గిళ్ళ ఉమా వివోఏ సొమ్మసిల్లి పడిపోయింది వెంటనే తోటి వివోఏలు ఆమెను దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివో ఏ ల మండల కార్యదర్శి గుగ్గిళ్ళ ఉమాను మాజీ సర్పంచ్ జిల్లా కాంగ్రెస్ నాయకులు మందడి ఇజ్రాయిల్ సీఐటీయు మండల కార్యదర్శి వశ పొంగు వీరన్న గుండ మల్ల ఉపేందర్ నెరసుల వెంకటేశ్వర్లు వైద్య శిక్ష పొందుతున్న గుగ్గిళ్ళ ఉమా ను పరమర్శించారు ఈ సందర్భంగా వివోఏ ల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల మాట్లాడుతూ వివో ఏలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా సమ్మె చేస్తున్నామని తీవ్ర ఎండలు ప్రభావంతో రోజుకో వివోఏ అనారోగ్యానికి గురి అవుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని ఆమె అన్నారు వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి వివోఏలకు కనీస వేతనం అమలు చేయాలని ఆమె కోరారు. వివో ఏలకు ఉద్యోగ భద్రత 57 సంవత్సరాల దాటిన వారికి పెన్షన్లు ఇన్సూరెన్స్ బీమా సౌకర్యం హెల్త్ కార్డులు హెచ్ఆర్పి పాలసీ ఉద్యోగ భద్రత కల్పించి వివోఏ ల పనిభారాన్ని తగ్గించాలని ఆమె కోరారు. ఎనిమిది రోజుల నుంచి చేస్తున్న వివోఏల దీక్షకు రోజుకో రాజకీయ పార్టీ నాయకులు ప్రజాసంఘాలు మద్దతు తెలియజేస్తున్నారు. శు క్రవారం బి.ఎస్.పి పాలేరు అసెంబ్లీ అధ్యక్షుడు వెన్నబోయిన రమేష్ యాదవ్. పాలేరు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొమ్ము పూలే, కార్యదర్శి పోలెపొంగు మల్సూర్, మండల నాయకులు లంజపల్లి నాగరాజు, వివోఏల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల, గుగ్గిల ఉమా, పోలిశెట్టి అరుణ, పోలూరి విజయలక్ష్మి, మెట్టు స్వరూప రాణి, కలమ్మ, బొడ్డు కుసుమ,మేకల కృష్ణవేణి, గోపోజు ఉపేంద్ర,గుంటి ధనలక్ష్మి, సామినేని కరుణ, గద్దల జ్యోతి, విజయ, లలిత, శ్రావణి, స్రవంతి, జయ, కుమారి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించేలా చర్యలు తీసుకోవాలి





**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

ప్రతిజ్ఞ మే 29

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి భాస్కర్,బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్,రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్.టి.సి.,విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు,మున్సిపల్ కమిషనర్లు,సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాహ్-వీర్ కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారుల పైన ప్రమాదానికి గురైన క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకురావడానికి ఎవరైతే ముందుకు వస్తారో వారికి ప్రభుత్వం ద్వారా పారితోషకం అందించడం జరుగుతుందని,అదే విధంగా జిల్లాలో రహత్ కార్యక్రమంలో భాగంగా 4 ప్రభుత్వ ఆసుపత్రులు, జిల్లా ప్రభుత్వాసుపత్రి, చెన్నూర్,బెల్లంపల్లి, లక్సెట్టిపేట సామాజిక ఆరోగ్య కేంద్రాలు, మెడిలైఫ్,టచ్,అభయ, ఆరోగ్యశ్రీ ప్రైవేటు ఆసుపత్రులలో జాతీయ రహదారుల పైన ప్రమాదానికి గురైన క్షతగాత్రులకు ఉచితంగా వైద్య సదుపాయాలు అందించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని,ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల,నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని,జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన,ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని,ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని,గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, రహదారులపై కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని,జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు,హెచ్చరిక బోర్డులు,జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి మండల,గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు,రద్దు చేయాలని,వారి వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు. అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని,గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం,డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.